# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ప్రతీ కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**2. తెలంగాణ ఐకానిక్‌గా టీ స్క్వేర్ నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు.**

**3. కాకినాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**

**4. రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

**5. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.**

==========================

ప్రతీ కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్' లక్ష్యంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరులోని మైపాడు గేట్ వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి గత రాత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

వాయిస్..26 సెకన్లు

-------------------------

తెలంగాణ ఐకానిక్‌గా టీ స్క్వేర్ నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. వచ్చే నెలాఖరులోగా వి-హబ్ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ సెంటర్‌లో ఈ అంశంపై మంత్రి డి.శ్రీధర్ బాబుతో కలిసి ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వి హబ్ నిర్మాణం కోసం జైకా నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

-------------------------

కాకినాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి రూట్ మ్యాప్ సిద్ధం చేసి, వంద రోజుల ప్రణాళికను తక్షణం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో తీర ప్రాంత కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. కాకినాడ జిల్లా పరిధిలోని తీర ప్రాంతంలో కాలుష్య నియంత్రణకు తీసుకోబోయే చర్యలు ఒక మోడల్‌గా ఉండాలన్నారు. ఇందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై పలు సూచనలు చేశారు.

-----------------------------

రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో.. న్యూడిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన', 'పప్పుధాన్యాల ఆత్మ నిర్భరత మిషన్' ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబరు 16 వరకు పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఇందు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలన్న ఉద్దేశ్యంతో పోషకాహార మాసం నిర్వహిస్తున్నారు. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో మొట్టమొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ నేడు శంకుస్థాపన చేయనున్నారు. 50 మెగావాట్ల ఏఐ ఆధారిత డేటా సెంటర్ తో గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ రూపుదిద్దుకోబోతోందని, సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

-----------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. 'సూపర్ జీఎస్టీ...సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా ఒంగోలులో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ వస్తువుల ప్రదర్శనను ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి 8 వేల కోట్ల రూపాయల మేర ఆదాయం తగ్గుతుందన్నారు. ఈ మేరకు ప్రజలకు లబ్ది కలుగుతుందన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిన్న నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రతిజ్ఞను నిర్వహించారు. అనంతరం మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి శాంతిదుర్గ ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్..28 సెకన్లు

-----------------------------

దేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్కతో కలిసి ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా కోటి 8 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ మొత్తంలో 80 లక్షల టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దేశంలో ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం ఏ రాష్ట్రం కొనుగోలు చేయలేదన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా, అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా మెరుగైన అనంతరమే వారిని ఆసుపత్రి నుంచి డిచ్ఛార్జి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, అధికారులతో ఆయన నిన్న మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం గుంటూరు జనరల్ ఆస్పత్రిలో 24 మంది విద్యార్థులు ఉన్నారని.. వీరిలో ఒక విద్యార్థికి ఇతర అనారోగ్య సమస్యలు ఉండడంతో మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తరలించి ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి అధికారులు వివరించారు.

-----------------------------

ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియంలో జరుగుతున్న భారత్, వెస్టిండీస్ క్రికెట్ రెండో టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 5 వికెట్ల నష్టానికి 518 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 4 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. వెస్టిండీస్ ఇంకా 378 పరుగుల వెనుకంజలో ఉంది. 3వ రోజు ఆట ఈ ఉదయం 9 గంటల 30 నిముషాలకు ప్రారంభం కానుంది.

-----------------------------

దక్షిణకోస్తా దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సగటున 3.1 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి జి. లక్ష్మీ తెలియజేస్తూ..

..వాయిస్.. 32 సెకన్లు

తెలంగాణలోనూ ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================